## విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 28-03-2025 సంపుటి : 06 సంచిక : 318 పేజీలు : 8 వెల : రూ 1-00


### నాణ్యమైన జీవన ప్రమాణాలతో అమరావతి

విజయవాడ,స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ లో స్వర్ణాంధ్ర 2047 సదస్సుకు మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరైయారు.మంత్రి మాట్లాడుతూ 2047 నాటికి మురికి వాడల రహిత నగరంగా ఏపీని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. విజన్ 2047 లో పది సూత్రాల అమలు తో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందించాలనేది సీఎం లక్ష్యం. దేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే నాటికి రాష్ట్రాన్ని సమగ్రమైన, సమతుల్యమైన అభివృద్ధి నమూనాగా రూపొందిస్తాం. వికసిత్ భారత్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని సీఎం చంద్రబాబు విజన్ 2047 ను రూపొందించారు. విజన్ 2047 లో కీలక అంశంగా అమరావతి కూడా ఉందని అన్నారు.అమరావతి కేవలం మౌలిక వసతుల ప్రాజెక్ట్ మాత్రమే కాదు...నాణ్యమైన జీవన ప్రమాణాలు ఉండేలా డిజైన్ చేశాం.






# 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తాం: చంద్రబాబు






విజయవాడ ,2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఇప్పటికి రూ.829 కోట్లు నేరుగా నిర్వాసితుల ఖాతాలో వేసిన ఘనత తమ ప్రభుత్వానిదని చంద్రబాబు అన్నారు. పోలవరంలో నీళ్లు వదిలే ముందే, 2027 నవంబర్ నాటికి పునరావాసం పూర్తి చేస్తామని కూడా సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు.పోలవరం ప్రాజక్టులో భూములు కోల్పోయిన బాధితులకు పునరావాసాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చేస్తామన్నారు.మన ఎన్డీయే ప్రభుత్వం వచ్చిందని, సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేసుకుందామని అన్నారు. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని నిర్మాణంలో ఆలస్యం వల్ల హైడల్ ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందని చంద్రబాబు చెప్పారు.వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలవరం నిర్వాసితులకు రూ.10 లక్షల పరిహారం ఇస్తానన్న విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక వైసీపీ ప్రభుత్వం పైసా కూడా విదల్చలేదని చంద్రబాబు ఎద్దేవా చేశారు.ఒఖఅఓ-1.తీజూణపోలవరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా నిర్వాసితులతో బాబు ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు పై విధంగా వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టు ప్రాంతాన్ని చంద్రబాబు పరిశీలించారు.

# బంగ్లా తాత్కాలిక అధినేతకు ప్రధాని మోదీ లేఖ..



న్యూఢిల్లీ: షేక్ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టి తాత్కాలిక ప్రభుత్వాధినేతగా యూనస్ మహమ్మద్ బంగ్లాదేశ్ లో అధికారం చేపట్టిన నాటి నుంచి ఆ దేశంలో హిందువులపై హింస చర్చనీయాంశంగా మారింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక నివేదికల ప్రకారం, ఆగస్టు 2024 నుంచి ఫిబ్రవరి 2025 మధ్య బంగ్లాదేశ్‌లో మైనారిటీలుగా ఉన్న హిందువులపై 2,374 కి పైగా హింసాత్మక దాడులు జరిగాయంటేనే పరిస్థితి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ కారణంగానే చిరకాల మిత్రులైన భారత్, బంగ్లాల మధ్య దూరం పెరుగుతూ వస్తోంది. ఇలాంటి సమయంలో స్నేహ హస్తం అందించేందుకు ఇండియా ఎల్లప్పుడూ సిద్ధమనే సంకేతం పంపిస్తూ బంగ్లాదేశ్ 53వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రధాని బంగ్లా తాత్కాలిక అధినేతకు లేఖ రాశారు. అందులో ఏముందంటే..బంగ్లాదేశ్ 53వ జాతీయ దినోత్సవం జరుపుకున్న సందర్భంగా గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వాధినేత ముహమ్మద్ యూనస్‌కు లేఖ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానంగా 1971 బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం అవిచ్ఛిన్న స్ఫూర్తిని భారతదేశం-బంగ్లాదేశ్ సంబంధాలకు పునాదిగా అభివర్ణించారు. ఆ దేశ స్థాపనలో భారతదేశం పాత్రను బంగ్లాదేశ్‌కు గుర్తు చేశారు. బంగ్లాదేశ్‌లో షేక్ ముజిబురాహ్మన్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో లేఖలో విముక్తి యుద్ధం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఇంకా ఆ లేఖలో ఏముందంటే, “బంగ్లాదేశ్ జాతీయ దినోత్సవం సందర్భంగా మీకు, బంగ్లాదేశ్ ప్రజలకు నా అభినందనలు తెలియజేస్తున్నాను. మన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాది వేసిన మన ఉమ్మడి చరిత్ర, త్యాగాలకు ఈ రోజు నిదర్శనంగా నిలుస్తుంది. బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం స్ఫూర్తి మన సంబంధానికి మార్గదర్శక కాంతిలా కొనసాగుతోంది. ఇది బహుళ విధాలుగా వృద్ధి చెంది మన ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను కలిగించింది. శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ఉమ్మడి ప్రయోజనాలు, ఆందోళనలు పరస్పరం భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లేందుకు మేం కట్టుబడి ఉన్నాం” అని రాశారు.షేక్ హసీనా బంగ్లాదేశ్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి ఆ దేశంలో హిందూ మైనార్టీలపై దాడులు పెరిగాయి. ఈ దాడులను భారత్ ఎప్పటికప్పుడు వ్యతిరేకిస్తూ ఆందోళనలు వ్యక్తంచేస్తుండటంతో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు పలుచబడ్డాయి. అయినప్పటికీ భారత్- బంగ్లా మైత్రిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. ఇందులో భాగంగానే బంగ్లాదేశ్ విదేశాంగశాఖ సలహాదారు ఏప్రిల్ 3-4 మధ్య థాయ్‌లాండ్‌లో జరగనున్న ఏడు దేశాల ‘బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్’ (బిమ్‌స్టెక్) సమావేశంలో మోదీతో యూనస్ ద్వైపాక్షిక భేటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

## వల్లభనేని వంశీకి బిగ్ షాక్.. కోర్టు కీలక నిర్ణయం..

విజయవాడ, మార్చి 27: వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి సెషన్స్ కోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. వంశీ బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో బెయిల్ కోరుతూ విజయవాడ 12 అదరపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో వంశీ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం.. డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది ధ్ర్మాసనం. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీ ఏ71గా ఉన్నారు. ఇక సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులోనూ వంశీ ముద్దాయిగా ఉన్నారు. ఈ కేసుల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ కోరుతూ కోర్టులను ఆశ్రయిస్తున్నప్పటికీ.. ప్రతిసారి ఎదురుదెబ్బే తగులుతుంది.



## పిఠాపురం అభివృద్ధిలో మరో ముందడుగు

అమరావతి: పిఠాపురం అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగానే కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు పర్యటించారు. పిఠాపురం అభివృద్ధి పనులపై ఇవాళ(గురువారం) అధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి వారం సమీక్ష చేపట్టాలి... క్షేత్ర స్థాయిలో పురోగతిని పరిశీలించాలని అన్నారు. మౌలిక వసతుల కల్పన విషయంలో చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. నియోజకవర్గం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా నిధులు సమకూరుస్తున్నామని స్పష్టం చేశారు. వాటిని సద్వినియోగం చేసి ప్రజలకు మేలు చేసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. శాంతిభద్రతల అంశంపై సంబంధిత విభాగం ఉన్నతాధికారులు, రాష్ట్ర డీజీపీ దృష్టికి తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.



## ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం గుడ్‌న్యూస్.. ఆ నిధులు విడుదల

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ స్కీమ్ 2.0 క్రింద ఏపీలోని సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం నాడు ఓ ప్రకటన విడుదల చేశారు. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సూర్యలంక బీచ్ రూపురేఖలు మారుస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇటీవల న్యూఢిల్లీ పర్యటనలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి సూర్యలంక బీచ్‌కు నిధులు ఇవ్వమని మంత్రి కందుల దుర్గేష్ కోరారు.

సరికొత్త హంగులతో సూర్యలంక ప్రాజెక్టు: మంత్రి కందుల దుర్గేష్

ఇప్పటికే సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం, పర్యాటకుల స్వర్గధామంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలతో కూడిన ప్రతిపాదనలు కేంద్రానికి మంత్రి కందుల దుర్గేష్ పంపించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని నిధులు మంజూరు చేసినందుకు కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు మంత్రి కందుల దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే సూర్యలంక ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, సరికొత్త హంగులతో పర్యాటకులకు దర్శనమివ్వబోతుందని తెలిపారు. సూర్యలంక బీచ్‌లో మౌలిక వసతులు కల్పించి పరిశుభ్ర బీచ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పర్యాటక ప్రగతికి కృషి చేస్తున్న టూరిజం సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటకశాఖ అధికారులను మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు తెలిపారు.




## వైసీపీ హయాంలో బడా స్కాం.. మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్

కృష్ణా: నాటుసారా రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు 2016లో తొలిసారిగా నవోదయం కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కృష్ణాజిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖాధికారులతో ఇవాళ(గురువారం) మంత్రి కొల్లు రవీంద్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ.. ఆరు నెలల్లో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మే 1వ తేదీ నాటికి రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారుగత జగన్ ప్రభుత్వంలో కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరించారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతిమయమైన ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. మద్యం కుంభకోణంలో పాత్రధారులు, సూత్రధారులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీలో మద్యం కుంభకోణం అతి పెద్ద స్కాం అన్నారు. ఢిల్లీలో కన్నా ఏపీలోనే మద్యం స్కాం ఎక్కువ అని టీడీపీ ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు పార్లమెంటులో చెప్పారని మంత్రి కొల్లు రవీంద్ర గుర్తుచేశారు.జగనే కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని నడిపించారని విజయసాయి రెడ్డి చెప్పారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మద్యం తయారీ నుంచి అమ్మకం వరకు అన్నింటిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. జగన్ తన ఆదాయం పెంచుకుని... రాష్ట్ర ఆదాయం తగ్గించారని మండిపడ్డారు. నాసిరకం మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారని విమర్శించారు. అసలు మద్యం అమ్మకాలు, వచ్చిన ఆదాయంపై విచారణ జరుగుతుందని చెప్పారు. సిట్ వేసిన సాయంత్రమే ఫైళ్లను తగులపెట్టారన్నారు. అన్నీ విచారణ పూర్తి అయ్యాక తప్పకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బియ్యం కేసు ఇంకా మూయలేదు... తమపై అనవసరంగా మాట్లాడే వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# ఆ ఒక్క మెసేజ్‌తో రంగంలోకి దిగిన మంత్రి నారా లోకేష్



గుంటూరు జిల్లా: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. సోషల్ మీడియాలో తన దృష్టికి వచ్చిన సమస్యలపై వేగంగా స్పందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సాయం చేస్తున్నారు. లోకేష్ సేవాగుణంపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా.. లోకేశ్ క్షణాల్లో స్పందించడంతో ఒకరికి అవయవ దానం, మరొకరికి ప్రాణదానం జరుగనుంది. గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో తీవ్ర అనారోగ్యంతో చేరిన చెరుకూరి సుష్మ బ్రెయిన్ డెడ్‌కు గురి అయ్యారు. దీంతో సుష్మ కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను దానం చేయడానికి నిర్ణయించుకున్నారు. సుష్మ అవయవదానంతో తిరుపతిలో మరొకరికి ప్రాణదానం జరుగనుంది.సుష్మ గుండెను తిరుపతిలోని మరొకరికి అమర్చనున్నారు. గుంటూరు నుంచి తిరుపతికి గుండెను తరలించడానికి సొంత ఖర్చులతో మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. ఇవాళ(గురువారం) రాత్రి 7 గంటలకు గ్రీన్ ఛానెల్ ద్వారా గుండెను గుంటూరు రమేష్ ఆస్పత్రి సిబ్బంది తిరుపతికి తరలించనున్నారు. దీంతో గుండె మార్పిడి విజయవంతం చేయడానికి వైద్యులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. సకాలంలో స్పందించిన మంత్రి నారా లోకేశ్‌కు సుష్మ కుటుంబ సభ్యులు, రమేశ్ హాస్పిటల్స్ వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సంపాదకీయం

శుక్రవారం 28-03-2025

## జమిలీకి జై కొట్టేస్తున్నారు...

దేశంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చింది భారతీయ జనతా పార్టీ. 2014, 2019, 2024 ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టింది. అటు చాలా రాష్ట్రాల్లో సైతం రాగలిగింది. ఇంకొన్ని రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో కలిసి అధికారాన్ని పంచుకుంటుంది. ఎలా చూసినా బిజెపి బలమైన శక్తిగా ఉంది. అందుకే ఈ శక్తిని పదిల పరుచుకునేందుకు బిజెపి సరికొత్త ప్రయోగం 'జమిలి' వైపు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ మాట చాలా రోజులుగా వినిపిస్తోంది. తెర వెనుక కార్యాచరణ జరుగుతోంది. అయితే తాజా పరిస్థితులను చూస్తుంటే మాత్రం బిజెపి జమిలి వైపేనని తేలిపోతోంది.మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ఆశించిన ఫలితాలు రాలేదు. బిజెపి సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ దాటుతుందని అంతా అంచనా వేశారు. కానీ జనాలు అవకాశం ఇవ్వలేదు. మ్యాజిక్ ఫిగర్ కు 40 సీట్లు దూరంగా బిజెపి ఉండిపోయింది. అటువంటి సమయంలోనే తెలుగుదేశం పార్టీతోపాటు నితీష్ పార్టీ అండగా నిలిచింది. అప్పుడే జమిలీ ఎన్నికల ఆలోచనకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. జమ్మూ కాశ్మీర్ తో పాటు ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురయ్యేసరికి జమిలి అంశం పక్కన పెట్టింది బిజెపి.తర్వాత మహారాష్ట్ర, 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రావడంతో జమిలిపై కదలిక వచ్చింది. వచ్చే ఎన్నికల్లో కూడా సత్తా చాటాలని బిజెపి భావిస్తోంది. తద్వారా కాంగ్రెస్ పార్టీకి ఉన్న రికార్డులను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇప్పుడు బిజెపి పరిస్థితి బాగుంది. ఆ పార్టీపై పాజిటివ్ ప్రచారం ఉంది. అందుకే ఇటువంటి సమయంలో జమిలి ఎన్నికల ద్వారా అనుకున్నది సాధించాలని చూస్తోంది. ఇప్పటికే జమిలి బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. ఆరు నెలల పాటు అధ్యయనం కూడా ముగిసింది. బిజెపి పాలిత రాష్ట్రాలే ఇప్పుడు ఎక్కువగా ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో బలమైన మిత్రపక్షాలు కూడా కొనసాగుతున్నాయి. అందుకే జమిలీపై ఏకాభిప్రాయానికి వచ్చి.. ముందస్తు ఎన్నికలకు సిద్ధపడుతోంది బీజేపీ. మరి కాషాయ దళం ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.ప్రస్తుతం కేంద్రంలో పాలుపంచుకుంటున్న కీలక నేత చంద్రబాబు సైతం జమిలి కి జై కొట్టారు. అన్ని ఎన్నికలు ఒకేసారి జరిగితే ఖర్చు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. ఇది దేశానికి అవసరం కూడా అన్నారు. అయితే బిల్లు ప్రకారం, దేశంలో జమిలి ఎన్నికలు 2034 నుంచి జరిగే అవకాశముంది. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్టరూపం సంతరించుకున్నాక జరిగే సాధారణ ఎన్నికల అనంతరం ఏర్పడే లోక్‌సభ తొలి సిటింగ్ డేకు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అపాయింటెడ్ డేగా పిలిచే ఆ రోజు తర్వాత ఏర్పడిన అన్ని అసెంబ్లీలు కూడా లోక్‌సభ కాలపరిమితితోపాటే ముగుస్తాయి. ఆ తర్వాత నుంచి లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలన్నీ ఏకకాలంలో జరుగుతాయి. లోక్‌సభగానీ, అసెంబ్లీగానీ పూర్తికాలం ముగియక ముందే రద్దయితే వాటికి 5 ఏళ్ల కాలంలో మిగిలిన సమయానికే ఎన్నికలు జరుగుతాయని బిల్లు పేర్కొంది. అందువల్ల జమిలి విధానం 2029 సార్వత్రిక ఎన్నికల తర్వాతే ఆచరణలోకి వస్తుంది. ఉదాహరణకు 2029 మేలో సార్వత్రిక ఎన్నికలు జరిగిన అనంతరం ఏర్పడే 19వ లోక్‌సభ మొదటి సిటింగ్ తేదీని రాష్ట్రపతి జూన్ 1గా నిర్ధరిస్తే ఆ తర్వాత ఏర్పడే అసెంబ్లీలన్నీ ఆ లోక్‌సభతోపాటే ముగుస్తాయి. దీనివల్ల ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. 2004 నుంచి కూడా వాటి ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటే జరుగుతున్నందున 2029, 2034లోనూ అదే విధానం కొనసాగుతుంది. తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లకు తదుపరి అసెంబ్లీ ఎన్నిక 2028 నవంబరు– డిసెంబరులో జరిగి 2033 నవంబరు వరకూ మనుగడలో ఉంటాయి. 2029లో ఏర్పడే 19వ లోక్‌సభ కాలపరిమితి 2034 మేలో ముగియనున్నందున 2033లో జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు, 2034 లోక్‌సభ ఎన్నికలకు మధ్య ఏర్పడే 6 నెలల వ్యవధికి రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. 2028 మే, జూన్ నెలల్లో జరిగే కర్ణాటక, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ లాంటి రాష్ట్రాల అసెంబ్లీలు 2033 మే, జూన్‌లలో ముగుస్తాయి. 2034తో జరిగే లోక్‌సభ ఎన్నికలతో వీటికి ఏడాది వ్యవధి ఉంటుంది కాబట్టి ఆ ఏడాదికే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా లేదంటే వాటికీ రాష్ట్రపతి పాలన అమలు చేస్తారా అన్నది చూడాలి. మిగిలిన రాష్ట్రాల్లోనూ ముందూ వెనుకా ఎన్నికలు ఉండటంతో ఏం చేస్తారన్నది వేచి చూడాలి.మరోవైపు బీహార్ లో ఎన్నికలు సమీపిస్తున్నాయి. అక్కడ ఎన్డిఏ భాగస్వామ్య పక్షం అధికారంలో ఉంది. ఆ అసెంబ్లీ ఎన్నికలతో పాటు జమిలి జరిగితే తప్పకుండా సీఎం నితీష్ కుమార్ ఆహ్వానిస్తారు. అయితే ఈ విషయంలో పక్కా ఆలోచనతో అడుగులు వేస్తోంది భారతీయ జనతా పార్టీ. జమిలి ద్వారా సరికొత్త రికార్డులను క్రియేట్ చేయాలని చూస్తోంది.

# ఆహారధాన్యాల దిగుమతులు

## దేశీయంగా రైతుకు సవాల్

న్యూఢిల్లీ,మార్చి27: దేశంలో ఆహార ధాన్యాల దిగుమతులపై దృష్టి సారించాలి. అంతేగాకుండా సమీక్షించుకోవాలి. మనదేశంలో అన్నిరకాల ధాన్యం పండుతున్న దిగుమతులు చేసుకోవడం, ఇక్కడి రైతులకు భరోసా లేకుండా చేయడం సరికాదు. అలాగే ప్రజలకు కూడా సరసమైన ధరలకు ఆహారా ధాన్యలు దక్కడం లేదని గుర్తించాలి. రైతులను ప్రోత్సహించడం ద్వారా అన్నిరకాల పంటలు పండించే అవకాశం ఉన్న భూములను ఉపయోగించుకోవాలి. రైతులను ప్రోత్సహిస్తే అన్నిరకాలు పంటలు పండిస్తారు.అందుకు మన భూములు అనుకూలంగా ఉన్నాయి.గతంలో రికార్డు స్థాయిలో 97 మిలియన్ టన్నుల గోధుమ ఉత్పత్తి అయిన నేపథ్యంలో, కేవలం 8 లక్షల టన్నుల గోధుమలను ఉక్రెయిన్, రష్యా నుంచి జీరో డ్యూటీతో దిగుమతి చేయడం ఆర్థికంగా అర్థరహితం. రైతులు గిట్టుబాటు ధర లేక ఉల్లిపాయలను వీధుల్లో పారేసిన ఘటనలు ఇంకా మనం మర్చిపోలేదు. ఇదిలా ఉండగా, గతంలో పండుగల సమయంలో ప్రభుత్వం 3 లక్షల టన్నుల చక్కెరను 25 శాతం డ్యూటీని తగ్గించి మరీ దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. పప్పు ధాన్యాలు దేశంలో విరగపండిన సమయంలో అది జరిగిందని నివేదిక వివరించింది. దీనితో ధరలు పడిపోయి, రైతులు అత్యంత చౌకగా తమ ఫలసాయాన్ని అమ్ముకోవలసి వచ్చింది.ఒక్క శనగ పప్పు మినహా మిగిలిన పప్పు ధాన్యాలు అన్నింటిపై రైతులకు లాభంలో మార్జిన్ 30 శాతం పడిపోయింది. ఇదే తరహా ధరలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దేశంలో ఈసారి పండిన పెసర, కందిపప్పుకు కొనుగోలుదారులు లభ్యం కావడం లేదు. హోల్ సేల్ ధరలు పెరగకపోవడంతో పరిస్థితి ఆశాజనకంగా లేదు. భారత దేశం ఇప్పటికే లక్షల టన్నుల పప్పు ధాన్యాలను మొజాంబిక్ నుంచి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందంపై సంతకాలు చేసింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా నుంచి పప్పు ధాన్యాలు, నూనె గింజలను దిగుమతి చేసుకునేందుకు సంప్రదింపులు జరుపుతోంది. అమెరికా వ్యవసాయ శాఖ భారత్ సోయాబీన్ దిగుమతులను పెంచుకోవాలని సూచించ డంతో, వంట నూనెల దిగుమతులపై పెంచిన సుంకాన్ని గణనీయంగా తగ్గించడమంటే, వ్యవసాయ ఔట్‌సోర్సింగ్ అనేది మినహాయింపుగా కాక విధానమైపోయింది. ఇది మన ఆహార స్వయం పోషకత్వానికే కాదు కోట్లాది సన్నకారు రైతుల జీవనోపాధికి ముప్పుగా పరిణమించింది. ఇలాంటి విధానాలను సమీక్షించుకోవాల్సిన సమయంఉంది. అప్పుడేరైతులకు మేలు జరుగుతుంది. ఆహారాన్ని దిగుమతి చేసుకోవడం అంటే నిరుద్యోగాన్ని దిగుమతి చేసుకోవడమే అన్న వాదనలో వాస్తవం గ్రహిచాలి. చౌకైన దిగుమతులను అనుమతించడమంటే, వ్యవసాయం నుంచి రైతులను బలవంతంగా బయిటకు పంపడమే. పంటలు దిగుబడులు సమయంలో దిగుమతులు వెల్లవలా వచ్చిపడటాన్ని ఎలా సమర్థించుకుంటారు. అందువల్ల ధాన్యం ఉత్పత్తి, దిగుమతులు, ఎగుమతులు తదితర అంవాలపై స్పష్టమైన వ్యయసాయ విధానం రూపొందించుకుటే తప్పమనం సంక్షోభం నుంచి బయటకురాలేం.

## అపూర్వ స్నేహితునికి ఆర్థిక సాయం చేసిన స్నేహితులు

వెల్దుర్తి :కర్నూలు జిల్లా మండల కేంద్రమైన వెల్దుర్తి లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989 –90 బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థులు గత కొన్ని రోజుల క్రితం ముప్పై నాలుగు సంవత్సరాల తరువాత కలుసుకొని పండుగలా వేడుకలు చేసుకున్నారు.అంతలోనే నాయకంటి నాగేంద్ర అనే తమ తోటి పదవతరగతి వరకు క్లాస్మేట్ మరియు బాల్య మిత్రుడు షుగర్ వ్యాధితో బాధపడుతూ మృత్యువాత పడ్డారని తెలుసుకున్న అతని మిత్రబృందం వెంటనే తమ పదవతరగతి బ్యాచ్ వాట్సాప్ గ్రూప్ లో అతనిని ఆదుకుందామని పిలుపు నిచ్చుకున్నారు. స్నేహితులందరు అపూర్వంగా స్పందించి యాభై వేల రూపాయలు యాబై వేలు రుపాయలు నగదు సేకరించి ఆ మొత్తాన్ని స్నేహితుని కుటుంబానికి అందించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ స్నేహితుడు నాయంకంటి నాగేంద్ర ట్రాక్టర్ డ్రైవర్ గా వనిచసేవాడని కష్టపడి జీవితంలో తన కూతుర్లకు పెళ్లిళ్లు చేశాడని ఇంకా పెళ్లి కావాల్సిన ఒక కుమార్తె ఉందని మొత్తం నలుగురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. షుగర్ వ్యాధితో బాధపడుతూ అతను సరిగా పనికి కూడా వెళ్లలేకపోయాడని తెలుసుకొన్న స్నేహితుల మందరము మా సంపాదనలో కొంత మొత్తం సేకరించి అతని కుటుంబానికి ఈరోజు అందజేస్తున్నామని ప్రతి ఒక్కరము సాటి స్నేహితుల కోసం స్పందించాలని ఒకరి కొకరు సహాయం చేసుకోవాలని ఆపదలో ఉన్న స్నేహితులని ఆదుకోవాలని తెలిపారు . వీరు చేసిన ఈ మంచి పనిని వెల్దుర్తి లోని పలువురు ఎంతో మెచ్చుకొని అపూర్వ స్నేహితులు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సుంకన్న,కుమ్మరి శ్రీనివాసులు, గఫూర్ మియ్య, వడ్ల మహేష్, మురళి రెడ్డి, శివరామిరెడ్డి, దేవరాజు,బెల్లం మద్దిలేటి, మద్దయ్య, సర్పంచ్ దేవరాజు వెంకటేష్, భాస్కర్ గౌడ్,జాకీర్, పాల్గొన్నారు.

# ఉగాది మహోత్సవములు ప్రారంభం

**ఐదురోజులపాటు (27.03.2025 నుండి 31.03.2025) నిర్వహింపబడే ఉగాది ఉత్సవాలు ఈ రోజు (27.03.2025) ప్రారంభమయ్యాయి.**





శ్రీశైలంకాగా ఈ ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమశాస్త్రానుసారం జరిపించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.యాగశాల ప్రవేశం:ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా కార్యనిర్వహణాధికారి స్థానాచార్యులు (అధ్యాపక) అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలో స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు.వేదస్వస్తి:ఆలయప్రవేశం చేసిన వెంటనే వేదపండితులు వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు.శివసంకల్పం:వేదపఠనం అయిన వెంటనే స్థానాచార్యులు ( అధ్యాపక) అర్చకస్వాములు, వేదపండితులు, లోకక్షేమాన్ని కాంక్షిస్తూ ఉత్సవ సంకల్పాన్ని పఠించారు. దీనికే శివసంకల్పం అని పేరు.ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించ కుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు జరగకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన, ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు సంకల్పపఠనం చేశారు.గణపతి పూజ:సంకల్పపఠనం తరువాత ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడింది.పుణ్యాహవచనం :గణపతిపూజ తరువాత పుణ్యాహవచనం జరిపించబడింది. వృద్ధి మరియు అభ్యుదయాల కోసం ఈ పుణ్యాహవచనం జరిపించబడుతుంది.చండీశ్వరపూజ:సంకల్పపఠనం తరువాత చండీశ్వరపూజ జరపించబడింది. ఈ ఉత్సవాలు క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివసరివార దేవతలలో ఒకరైన చండీశ్వరుని నాయకత్వంలో నిర్వహించబడుతాయని చెప్పబడుతోంది.అందుకే యాగశాల ప్రవేశం తరువాత చండీశ్వరుని ప్రత్యేకంగా పూజాదికాలు జరపించడంసంప్రదాయంకంకణ పూజ, కంకణధారణచండీశ్వరపూజ తరువాత కంకణాలకు రక్షాబంధనాలకు) శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. తరువాత అధికారులు, కార్చకస్వాములు కంకణాలను దరించారు.కంకణధారణ తరువాత ఋ?త్విపహణం: నిర్వహించబడింది. ఉత్సవాలలో ఆయా వైదిక కార్యక్రమాలు నిర్వహించమని ఋత్వికులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసీ కార్యక్రమానికే ఋత్విగ్వరణం అని పేరు.అఖండస్థాపన:ఋత్విగ్వరణం తరువాత అఖండదీపస్థాపన చేయబడింది. అనంతరం వాస్తుపూలుచేయబడింది.రుద్రకలశస్థాపన:వాస్తు హోమం తరువాత మండపారాధన చేసి ప్రత్యేక కలశస్థాపన చేయబడింది. కలశస్థాపన తరువాత కలశార్చన జరిపించబడింది. తరువాత పంచావరణార్చనలు నిర్వహించబడ్డాయి.అనంతరం లోకకల్యాణం కోసం జపానుష్ఠానాలు జరిపించబడ్డాయి.ఉత్సవాల మొదటిరోజు సాయంకాలం జరిగే అంకురార్పణకు ఎంతో విశేషముంది. ఈ కార్యక్రమములో ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత పునీత ప్రదేశములోని మట్టిని సేకరించి

యాగశాలకు తీసుకువస్తారు. దీనినే 'మృత్సంగ్రహణం" అంటారు. తరువాత ఈ మట్టిని తొమ్మిది పాలికలలో (మూకుళ్ళలో) నింపి దాంట్లో నవధాన్యాలను పోసి, మట్టిలో మొలకెత్తించే పనిని ప్రారంభిస్తారు.ఈ అంకురారోపణ కార్యక్రమానికి చంద్రుడు అధిపతి, శుక్లపక్ష చంద్రునివలే పాలికలలోని నవధ్యానాలు సైతం దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు. పాలికలలో రోజూ నీరు పోసి నవధాన్యాలు. పచ్చగా మొలకెత్తేలా చూస్తారు. అలంకారాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టే దీనికి అంకురార్పణ అది పేరు.ఈ ప్రారంభ పూజలలో కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావ అర్చకస్వాములు, వేదపండితులు, సంబంధిత అధికారులు, సిబ్బంచి పాల్గొన్నారు.భృంగివాహనసేవఈ ఉత్సవాలలో భాగంగానే ఈ సాయంకాలం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసే, జరిపించబడుతుంది. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగీవాహనసేదపై వేంచేబు వేయించి విశేషంగా అలంకార మండపములో పూజాదికాలు జరిపించబడుతాయి. తరువాత గ్రామోత్సవం నిర్వహించబడుతుంది.భృంగివాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించడం వలన పనులలో ఏకాగ్రత అభిస్తుందని, పాపాలను హరించబడుతాయని చెప్పబడుతోంది.మహాలక్ష్మి అలంకారంఉత్సవాలలో భాగంగా ఈ రోజు (27.03.2025) శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తికి మహాలక్ష్మి అలంకారం గ్రామోత్సవం జరుగనున్నాయి.చతుర్భుజాలు గల ఈ దేవిపై రెండు చేతులలో పద్యాలను, క్రింది చేతులలో కుడివైపున అభయ హస్తం, ఎడమ వైపు వరముద్రతో దర్శనం ఇవ్వనున్నారు, మహాలక్ష్మి స్వరూపాన్ని దర్శించడం వలన శత్రుబాధలు నివారించబడి, సకల శుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది.అదే విధంగా గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కీరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంబాయ్ డోల్ దేష్, విళక్కు స్వాగత నృత్యం, వీరభద్రదోలు కుణిత, జాంజ్ పథర్ (కర్ణాటక డోలు) జాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గౌరవనృత్యం, తప్పెటచిందు, జీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయబడ్డాయి

## చలివేంద్రం ను ఆరంభించిన సర్పంచ్ అరుణా దేవి..



ఆలూరు:ఎండ వేడిమి తీవ్ర తరం కావడం తో ప్రజలు ,ప్రయాణికులు త్రాగు నీటి కి ఇబ్బంది పడకుండా చలివేంద్రము ప్రారంభించినట్లు ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నగరూరు అరుణదేవి తెలిపారు.. గురువారం స్థానిక చెక్పోస్ట్ వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రమును ఆమె ప్రారంభించి నీటిని పంపిణీ చేశారు... కార్యక్రమంలో సెక్రటరీ ప్రభాకర్ రావు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు..

## శ్రీ చౌడేశ్వరి అ మ్మవారి జ్యోతులకు శానిటేషన్ సిబ్బందిని నియమించిన. ఈవో ఆర్డి.సతీష్ కుమార్ రెడ్డి.



బనగానపల్లె:నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు బ్రహ్మోత్సవాలకు రాయ బారాధి జ్యోతి రథ మహోత్సవ కార్యక్రమాలకు బనగానపల్లె మండలం టంగుటూరు రామకృష్ణాపురం బీరవోలు మొదలగు గ్రామపంచాయతీల కార్యదర్శిలను శానిటేషన్ పనుల నిమిత్తము బనగానపల్లె ఈవో ఆర్ డి సతీష్ కుమార్ రెడ్డి నియమించారు ఈ విధులకు నియమించిన పంచాయతీ కార్యదర్శులు నందవరం చౌడేశ్వరి మాత దేవాలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కామేశ్వరమ్మ విరందరితో పనులు చేయించు కోవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు మార్చి నుండి ఏప్రిల్ 5 వరకు విధులలో ఉండేటట్లు ఏర్పాటు చేశారు

## మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.39-23 లక్షలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27- : ప్రముఖ పుణ్య క్షేత్రమైన మహానందిలో భక్తులు హుండీల ద్వారాసమర్పించిన కానుకలను లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఆలయంలోని అభిషేక మండపంలో ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలోని హుండీల ద్వారా రూ.38.71.856. రాగా, అన్నప్రసాదం హుండీ ద్వారా రూ.31.134, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.20.415 కలిపి మొత్తంగా రూ.39.23.405 ఆదాయం వచ్చిందని. అలాగే 87గ్రాముల 200 మిల్లి గ్రాముల బంగారం. 475 గ్రాముల వెండి , ఈ మొత్తం 35 రోజుల్లో సమకూరిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డివిజన్ ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, ఏఈవో వై.మధు, పర్యవేక్షకులు. ఇన్ స్పెక్టర్లు. ఆలయ అర్చకులు యూనియన్ బ్యాంక్ సిబ్బంది , బాలాజీ సేవా సమితి, తిరుమల బాలాజీ సేవా సమితి, భ్రమరాంబ సేవా సమితి సేవకులు పాల్గొన్నారు.

## జొన్నలను కొనుగోలు చేయండి---

### బొజ్జా దశరథరామిరెడ్డి---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27-నంద్యాల జిల్లాలో రైతులు విస్తృతంగా జొన్న సాగు చేసారనీ అయితే బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా వుండటం వలన ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి గురువారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ కు వినతిపత్రం అందజేశారు .జొన్నల కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పి మూడు వారాలు అయినప్పటికీ నేటి వరకు రైతుల దగ్గర నుండి సేకరణ ప్రారంభం కాకపోవడం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. రైతులు తమ ధాన్యాన్ని తమ కల్లాలలోనే వుంచుకున్నారని ప్రస్తుతం అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరంచాలని జాయింట్ కలెక్టర్ గారిని కోరారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..జొన్నల సేకరణకు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వచ్చే వారం నుండి జొన్నల సేకరణ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. అంతవరకు రైతులు వర్షాల నుండి తమ ధాన్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో గడివేముల మండలం గడిగరేవుల సర్పంచ్ హరినాథరెడ్డి, బలపనూరు మురళీధరరెడ్డి, యాళ్ళూరు గ్రామం పి.దశరథరామిరెడ్డి మరియు పాణ్యం , గడివేముల, గోస్పాడు రైతులు పాల్గొన్నారు.

## టౌన్ హాల్ లో 29 వతేదిన ఇఫ్తార్ విందు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పవిత్ర రంజాన్ మాసము సందర్భంగా నంద్యాల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ వారు సర్వోన్నతాదికారి, నంద్యాల వారి అధ్యక్షతనతో 29 వతేదిన సాయంత్రం గం.6-00 లకు మున్సిపల్ టౌన్ హాల్, రామకృష్ణ డిగ్రీ కళాశాల దగ్గర, "ఇఫ్తార్ విందు" ను ఏర్పాటు చేయడమైనదని జిల్లా అధికారులు తెలిపారు . సదరు ఇఫ్తార్



విందునకు మంత్రి ఎన్ ఎమ్ డి . ఫారూక్ , పార్లమెంటు సభ్యులు భైరెడ్డి శబరి , శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలు హాజరవుతారు. కావున ముస్లిం సోదరులు అందరు సదరు ఇఫ్తార్ విందుకు విచ్చేయవలసినదిగా జిల్లా అధికారులు సూచించారు .

# అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆర్ఐఓ ను సస్పెండ్ చేయాలి.




### ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఏఐఎస్ఎఫ్ నాయకులను దుర్భాషలాడడం సిగ్గుచేటు
### ఆర్ఐఓ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు.
### ఆర్ఐఓ ను తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తాం
### ఇది ప్రజాస్వామ్యమా లేక పోలీస్ రాజ్యమా
### ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ భాష



విభారే న్యూస్. కర్నూల్ ప్రతినిధి అవినీతి,ఆక్రమాలకు పాల్పడుతున్న ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారి, ఆర్ఐఓ గురువయ్య శెట్టిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి. సోమన్న, ఎస్. షాబీర్ భాష డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారుఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ భాష మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలలు అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని అన్నారు అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రంగురంగుల కరపత్రాలు, భారీ హోర్డింగ్ లు పెట్టి ప్రచారాలు,ప్రసారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారని, అడ్మిషన్ ముందు ఒక ఫీజు, అడ్మిషన్ తర్వాత ఇంకొక ఫీజు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు వీటన్నిటినీ అరికట్టాల్సిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారి, ఆర్ఐఓ నిమ్మకు నీరత్తినట్లు వ్యవహరిస్తూ, ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి, వాటి వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉందని అన్నారు గురువయ్య శెట్టి ఆర్ఐవో బాధ్యతలను స్వీకరించినప్పటి నుంచి జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు కావున ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు స్పందించి, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఆర్ఐఓ ను సస్పెండ్ చేసి, ఆయన అవినీతి అక్రమాలపై సిబిఐ,సిఐడి లతో విచారణ జరిపించి, ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలల ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని, ఫీజుల దోపిడీని నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధంగా ఉన్నామని,హెచ్చరించారు. అనంతరం ఆర్ఐఓ గురువయ్య శెట్టి దిష్టిబొమ్మ దహనం చేస్తుండడంతో పోలీసులు అడ్డగించి, ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేసి, మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. అక్రమ అరెస్టులతో ఉద్యమాలని ఆపలేరు ఆర్ ఐ ఓ తొత్తుగా మారిన పోలీస్ యంత్రాంగం నశించాలని అన్నారు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నటువంటి విద్యార్థి సంఘ నాయకులపై మీ పోలీసుల ప్రతాపం చూపించడం కాదు, జిల్లాలో కర్ణాటక మద్యం ఏరులై పారుతుంది, గుట్కా మరియు మట్కా, క్రికెట్ బెట్టింగ్స్ చేసేటి వాళ్ళపైన మీ ప్రతాపం చూపించండి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గర్ల్స్ కన్వీనర్ అక్షర జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, నగర అధ్యక్ష,కార్యదర్శులు అభి,అశోక్, నాయకులు ముని,నాని,శ్రీను, వీరెష్, మోహన్, కుమార్, వరుణ్, సందీప్, రాము, తదితరులు పాల్గొన్నారు

## 4 పార్కింగ్ ప్రదేశాలకు బహిరంగ వేలంపాట

### నగరపాలకకు రూ.16.03 లక్షల ఆదాయం
### అనివార్య కారణాలతో 2 ప్రదేశాల వేలంపాట వాయిదా





విభారే న్యూస్. కర్నూల్ ప్రతినిధి మార్చి 27 నగరంలో వివిధ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలకు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు అధ్వర్యంలో గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాల్లో ప్రశాంతంగా వేలంపాటలు ముగిసాయి. మొత్తం 6 పార్కింగ్ ప్రదేశాలకు బహిరంగ వేలంపాట నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల రెండింటికీ వాయిదా పడ్డాయి. వినాయక ఘాట్ పార్కింగ్ ప్రదేశానికి ఎవరు పాట పాడటానికి ముందుకు రాకపోగా, నగరపాలక సంస్థ కార్యాలయంలోని పార్కింగ్ ప్రదేశానికి అనివార్య కారణాలతో వాయిదా వేశారు. మిగిలిన 4 పార్కింగ్ ప్రదేశాల వేలంపాట ద్వారా నగరపాలకకు రూ.16.03 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ, ఆర్ఓ జునైద్, సూపరింటెండెంట్ వాజిద్, ఆర్ఐలు తిప్పన్న, ఖలీల్, సుహైల్, డిపిఓ వినోద్, వందన, తదితరులు పాల్గొన్నారు.ప్రదేశాలను దక్కించుకున్న లీజుదారులు.. 1. కింగ్ మార్కెట్ కూరగాయల మార్కెట్ పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.6.35 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి జి.యం.డి. ఖాజిం హుస్సేన్ రూ.6.80 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు. 2. కింగ్ మార్కెట్ పక్కనున్న చేపల మార్కెట్ పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.1.35 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి టి.జి. రమేష్ బాబు రూ.1.45 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు. 3. కిడ్స్ వరల్డ్ పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.3.95 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి వై.రామ్‌చరణ్ రూ.4.15 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు. 4. శ్రీనివాస క్లాత్ మార్కెట్ వద్ద పార్కింగ్ ప్రదేశానికి ధరవత్తు రూ.3.24 లక్షలు నిర్ణయించగా, అత్యధికంగా పాట పాడి వై.రామ్‌చరణ్ రూ.3.63 లక్షలతో పార్కింగ్ ప్రదేశాన్ని దక్కించుకున్నారు.

## కేంద్ర పద్దు రావాలంటే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి---

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి---

పట్టణానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 15 ఆర్థిక సంఘం నిధులు రావాలంటే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కమిషనర్ గురువారం సచివాలయ సిబ్బంది తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్రం వివిధ గ్రాంట్ల కింద నిధులు విడుదల చేస్తోంది. ఇందులో ముఖ్యమైంది 15వ ఆర్థిక సంఘం నిధులు. వీటిలో కాలనీల్లో పారిశుద్ధ్యం, మంచినీరు, ఇతర మౌలిక వసతులు కల్పించడానికి ఉపయోగిస్తారు. పన్నుల



వసూలు 70-80 శాతం ఉంటే కేంద్రం ఇచ్చే నిధుల్లో కోత ఉండదన్నారు . మున్సిపల్. సచివాలయ సిబ్బంది తీరుతో కేంద్ర నిధులకు కోత పడేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు . అదేవిధంగా గుత్తేదారులకు ఎక్కడికక్కడే బిల్లులు చెల్లించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించిందని మున్సిపాల్టీ కి ఆదాయం లేకుంటే చెల్లించడం కష్టమవుతుందన్నారు. కావున మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఈ నెల 31 వతేది లోపు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు .

## ఘనంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన వేడుకలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27- రంగస్థలం అయినా, రాజకీయమైనా, సేవా భావమైనా మెగా ఫ్యామిలీ తర్వాతే అంటూ అని చాటి చెబుతూ...తండ్రికి తగ్గ తనయుడిగా బాబాయికి తగ్గ వినయుడిగా అన్నిటికీ మించి యువతకు రోల్ మోడల్ గా నడుచుకుంటూ పద్మవిభూషణ్ కొణిదల చిరంజీవి గారి సేవా భావాన్ని ముందుకు తీసుకుపోగల వారసుడు కొణిదల రామ్ చరణ్ గారికి జన్మదినం సందర్భంగా ఆళ్ళగడ్డ జనసేన పార్టీ కార్యాలయంలో మెగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసిన ఆళ్ళగడ్డ అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రాచంశెట్టి చిన్న పెద్దయ్య, జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య. రామ్ చరణ్. రాబోయే చిత్రాలు మరింత విజయం సాధించాలని, తండ్రికీ తగ్గ తనయుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెగా అభిమానులు ఆంజనేయులు, శ్రీరాములు, వెంకటసుబ్బయ్య, గుర్రప్ప, జగదీష్, చైతన్య, రామయ్య, శ్రీనివాసులు, శ్రీరామ్ యాదవ్, మధు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ---



### వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిన్ అమీర్ బాష--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 27-నంద్యాల వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అమీర్ బాషా ఆధ్వర్యంలో చీరలు, రంజాన్ తోఫా కిట్లను గురువారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి హాజరైనారు.పట్టణం లోని రెండు వేల మంది పేద ముస్లిం కుటుంబాలకు చీరలు, రంజాన్ తోఫా కీట్లను ఉపాధ్యక్షుడు దాల్ మిల్ అమీర్, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ అధికారం ఉన్న లేక పోయినా ప్రతి సంవత్సరం ఆమీర్ భాష మహిళలకు చీరలు, రంజాన్ తోఫా కిట్లు మహిళలకు అందించడం అభినందనీయమని,అమీర్ కుటుంబాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు.హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే ప్రశ్నించాలనీ కోరారు.ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ సోమశేఖర్ రెడ్డి , వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవ నగర్ బాషా, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190